టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఇఫ్తార్ వేడుకలు నిర్వహించారు. బుధవారం రాత్రి గగన్‌విహార్ ప్రాంతంలోని టీఎన్జీఓస్ కార్యాలయం వద్ద జోరుగా ఇఫ్తార్ విందు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందు మత సామరస్యానికి దోహద పడుతాయన్నారు. ప్రేమానురాగాలు, స్నేహభావాలను పెంపొందించేందుకు ఈ విందులు కృషి చేస్తాయన్నారు. ఈ వేడుకల్లో ఆడిట్ రిజిస్ట్రార్ రవీందర్, సయ్యద్



ఇఫ్తార్ వేడుకల్లో డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

జహంగీర్, సయ్యద్ సందాని, విక్రమ్‌కుమార్, కేఆర్. రాజ్‌కుమార్, ఉమర్‌ఖాన్, మహ్మద్ ముజీబ్, వైదిక్ శాస్త్రి, శ్రీధర్ నాయుడు, అస్సదుద్దీన్ హుస్సేని, సీమా ముజీబ్, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

డయాలసిస్ సెంటర్ పరిశీలన



గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని వైద్య విధాన పరిషత్ డిస్టిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్‌లోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా డయాలసిస్ సెంటర్, మార్చి నెల గణాంకాలను ఆయనకు వివరించారు. డయాలసిస్ సెంటర్‌లో మొత్తం హెచ్‌డీ మిషిన్లు ఐదు ఉన్నాయని, నాలుగు నెగటివ్ మెషిన్లు, హెచ్‌సీవీ పాజిటివ్ మెషిన్ ఒకటి ఉందన్నారు. మార్చినెలలో 158 మంది పురుషులు, 107 మహిళలకు డయాలసిస్ సేవలు అందించామన్నారు. 232 నెగటివ్ పేషంట్స్, 33 మంది పాజిటివ్ పేషంట్లకు సేవలు అందించామన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచే కాకుండా పొరుగు నియోజకవర్గాల నుంచి కూడా డయాలసిస్ కోసం తమ వద్దకు వస్తుంటారని ఈ సందర్భంగా మహ్మద్ మజహరుల్లా వివరించారు. డాక్టర్ల పనితీరు, సిబ్బంది చేస్తున్న సేవలతోనే ఆస్పత్రికి గుర్తింపు వస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. పేషంట్లకు ఇబ్బందులు కలగకుండా డయాలసిస్ వార్డులో డ్యూటీ డాక్టర్ సేవలను అందుబాటులో ఉంచుతున్నామని అవసరమైన సిబ్బంది కూడా డయాలసిస్ సెంటర్‌కు కేటాయించామన్నారు. క్రమేనా ఆస్పత్రికి డయాలసిస్ కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుందన్నారు. మహబూబ్ పాషా, ఎస్‌హెచ్‌ఏ స్టేట్ కో– ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ ఈవో శ్రీనివాస్, అనుదీప్, డిప్యూటీ ఈఈ చంద్రశేఖర్ తదితరులున్నారు.

పాఠశాల స్నాతకోత్సవ వేడుకలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వర్ణరేఖ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నతస్థాయి లక్ష్యాలను దృఢపరిచేందుకు విద్యార్థులకు స్నాతకోత్సవ కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. పిల్లల అభిరుచులను అనుసరించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ధృడ పరిచేం



దుకు ప్రోత్సాహక పట్టాను గుర్తింపు అందించడం అభినందనీయమన్నారు. పాఠశాల జోనల్ డీన్ జ్యోతి, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ రుబీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు



మసీదు కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఈనెల 5న రంజాన్ మాసం చివరి శుక్రవారం ప్రార్థనలు జరిగే మసీదులు, వాటి పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తాను శానిటేషన్ అధికారులను ఆదేశించానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ, నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్‌లలోని మసీదులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మసీదు నిర్వహణ కమిటీతో మాట్లాడారు. మసీదుల్లో ప్రతి రోజు సాయంత్రం ఇఫ్తార్ అనంతరం వ్యర్థాలను మసీదు బయట ప్రత్యేకంగా కుప్పలు ఏర్పాటు చేయాలని మరుసటి రోజు ఉదయమే పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి వాటిని తొలగిస్తారన్నారు. మసీదులకు వచ్చే వారికి పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై వివరించాలన్నారు. దీన్ని వల్ల చెత్త, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయడానికి వీలుండదని ఆయన అన్నారు. ముఖ్యంగా ఇఫ్తార్ విందులు జరిగే ప్రాంతాల్లో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం నుంచి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇఫ్తార్ అనంతరం వ్యర్థాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కాకుండా ప్రత్యేకంగా ఒకే దగ్గర వేయాలని ఆయన అన్నారు. రంజాన్ మాసంలో మసీదు వారికి అవసరమైతే తాగునీటి ట్యాంకర్లను ఉచితంగా పంపుతామన్నారు. నీరు అవసరం ఉన్న మసీదుల వారు ముందుగా జలమండలి ఏరియా అధికారికి చెప్పాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, పాషాభాయ్, అలీముద్దీన్ తదితరులున్నారు.

కత్తితో పొడిచి వ్యక్తి దారుణ హత్య

బహదూర్‌పురా : కుటుంబ తగాదాల కారణంగా ఓ వ్యక్తి తన బావమరిదిని అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన బుధవారం ఉదయం బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రషీద్ (28) కుట్టుమిషన్ల మెకానిక్. అదే ప్రాంతానికి చెందిన షకీల్ అహ్మద్ బావబావమరుదులు. అబ్దుల్ రషీద్ చెల్లెలిని షకీల్ అహ్మద్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వారం రోజుల క్రితం భార్య ఖులా (విడాకులు) ఇచ్చింది. భార్యను తన నుంచి దూరం చేయడంలో బావమరిదే కారణమని షకీల్ అహ్మద్ కక్ష పెంచుకున్నాడు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో నంది ముస్లాయిగూడ రోడ్డుపై కనబడటంతో వాగ్వాదానికి దిగాడు. కోపంతో తనతో తెచ్చుకున్న కత్తితో బావమరిదిపై విచక్షణా రహితంగా పొడిచాడు. తీవ్ర గాయాలపాలైన రషీద్ రక్తపు మడుగులో కూలిపోయాడు. ఘటనా స్థలాన్ని దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య సందర్శించారు. మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగదు రవాణాపై ప్రత్యేక నిఘా



అధికారులను అభినందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

అబిడ్స్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో నగదు రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళ్‌హాట్ పోలీసులు, ఎన్నికల తనిఖీల బృందం రూ. 1.5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో బుధవారం మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సీపీ సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.5.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగర కమిషనరేట్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామన్నారు. సమావేశంలో సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి, గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై కత్తులతో దాడి

యువతితో ప్రేమపెళ్లి వ్యవహారమే కారణం

లంగర్‌హౌస్: తమ కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని యువతి బంధువులు నడిరోడ్డుపై వీరంగం సృష్టించారు. తల్వార్లతో ముగ్గురు అన్నదమ్ముళ్లపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. లంగర్‌హౌస్ రాందాస్‌పురలో నివసించే హరిప్రసాద్ పోలీస్ కానిస్టేబుల్. కాగా అతడికి గతంలోనే వివాహమైంది. ఇద్దరు సంతానం కూడా ఉన్నారు. అతడి ఇంటి సమీపంలో ఉండే ఓ యువతికి సాయం చేస్తూ.. ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. సదరు యువతి చెల్లి వివాహం దాదాపు 3 ఏళ్ల క్రితం జరిగింది. రెండు నెలల క్రితం హరిప్రసాద్, యువతి కలిసి తన భార్యను ఒప్పించి యువతి ఇంట్లో చెప్పకుండా వివాహం చేసుకున్నారు. ఈ విషయమై యువతి కుటుంబీకులు లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తన ఇష్ట ప్రకారమే వివాహం చేసుకున్నానని ఆమె పోలీసులకు రాతపూరకంగా తెలిపింది.

కత్తులతో దాడి....

ఇదిలా ఉండగా బుధవారం రాత్రి లంగర్‌హౌస్ చెరువు కట్ట వద్ద నుంచి ఇంటికి వెళ్తున్న హరిప్రసాద్‌పై యువతి బంధువులు కత్తులు, తల్వార్లతో దాడికి దిగారు. విషయం తెలుసుకున్న అతని తమ్ముళ్లు అక్కడకు పరుగెత్తగా.. వారిపై కూడా కత్తులతో దాడి చేశారు. తీవ్ర రక్తస్రావానికి గురైన బాధితులను వెంటనే స్థానికులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

◆ ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న మహిళా ఎస్సై ఘటనా స్థలానికి చేరుకున్నారు. 'వీరే పాన్ షాప్‌కు వెళ్లి కత్తులతో ఎవరికి వారే పొడుచుకున్నారని, ఆమె నిర్లక్ష్యంగా మాట్లాడారని' స్థానికులు చెబుతున్నారు. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇన్‌స్పెక్టర్ దాడి వివరాలను సేకరించి నిందితులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

గోల్కొండ: పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు అధికారుల అలసత్వానికి అద్దం పడుతోంది. గుత్తేదారులు సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలకు శాపంగా మారుతున్నాయి. గత 15 నెలల క్రితం గోల్కొండ, నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్‌లలో వరద ముంపును అరికట్టేందుకు భారీ పైపులైన్ పనులు ప్రారంభమయ్యాయి. ఎండీలైన్స్ చౌరస్తా, టోలిచౌకీ చౌరస్తా, సెవన్ టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ పనులు ఏకకాలంలో ప్రారంభమయ్యాయి. ఈ పనులకు భారీ తవ్వకాలు చేపట్టారు. రోడ్డు మొత్తం తవ్వేయడంతో ఆ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకీ–టూమ్స్ రోడ్డులో నెమ్మదిగా సాగుతున్న పనులు ద్విచక్ర వాహనాలు, పాదచారులకు అత్యంత ప్రమాదకరంగా మారాయి. భారీ గుంతలను తవ్విన కారణంగా ఆ ప్రాంతంలో రోడ్డుపై మట్టికుప్పలు గుట్టల్లా పేరుకుపోయాయి. నత్తనడకన సాగుతున్న ఈ పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రోడ్డు పక్కనే భారీ వాహనాలు..

తవ్వకాల కోసం ఉపయోగించిన జేసీబీలు వారాల తరబడి రోడ్డు మధ్యలోనే ఉండిపోతున్నాయి. ఈ కారణంగా ఆ ప్రాంతాల్లో ప్రతి నిత్యం ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా గుంతలు తవ్విన చోట సరైన ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. ప్రమాదాల భారీన పడుతున్న ప్రజలు..

తవ్విన ప్రాంతం చుట్టూ గట్టి కంచెను వేయకుండా కేవలం తూతూ మంత్రంగా జాలీని ఏర్పాటు చేశారు. గత నెలలో ద్విచక్ర వాహనదారుడు గుంత పక్క నుంచి వెళ్తూ.. మట్టి జారడంతో గుంతలో పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్నవారు సదరు వ్యక్తిని రక్షించారు.



ఎండీలైన్స్ వద్ద కొనసాగుతున్న పైపులైన్ పనులు

తాజాగా సోమవారం టోలిచౌకీ టూమ్స్ రోడ్డుపై పైపులైన్ పనులు జరుగుతున్న గుంతలో కాలినడకన వెళ్తున్న ఓ వృద్ధుడు మట్టి జారి భారీ గుంతలోకి జారిపడ్డాడు. స్థానికులు వెంటనే కేకలు వేయడంతో అప్రమత్తమైన అక్కడ పనిచేస్తున్న కార్మికులు వెంటనే గుంతలోకి దిగి వృద్ధుడిని పట్టుకుని జేసీబీ హ్యాండిల్ సాయంతో పైకి తీసుకొచ్చారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్న కూడా అధికారులు తమ తీరును మార్చుకోకపోవడం గమనార్హం. పైపులైన్‌ల కోసం వేసిన భారీ గుంతల చుట్టూ.. ప్రమాదాలు జరగకుండా సరైన కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుమ్ము.. ధూళి..

పైపులైన్ కోసం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాల్లో అధికారులు వాహనాలను దారిమళ్లిస్తున్నారు. ఎండీలైన్స్‌లో రెండు ప్రాంతాల్లో ఈ విధంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎండీలైన్స్ చౌరస్తా నుంచి శాతం చెరువు పక్క నుంచి చిన్నచిన్నగల్లీల మీదుగా వాహనాలు దర్గా దగ్గరకు వస్తున్నాయి. కాగా ఇరుకైన సందుల నుంచి వాహనాలు వస్తున్నందున తమ ఇళ్లల్లో దుమ్ముధూళి వచ్చి చేరుతుందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దుమ్ముధూళితో పలువురు వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యాల బారినపడుతున్నారు. దీనికితోడు వాహనాల శబ్దాలతో తమకు ఇళ్లల్లో నిద్ర కరువైందని పలువురు వాపోతున్నారు.

సంవత్సరానికి పైగా అవస్థలు..

దాదాపు సంవత్సరానికి పైగా ఈ విధంగా తాము ఇళ్లల్లోనే దుమ్ముధూళితో నానా ఇబ్బందులు పడుతున్నామని పలువురు అంటున్నారు. పనులు త్వరగా పూర్తి చేయించి వాహనాల రాకపోకలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కేన్సర్ బాధిత చిన్నారికి చేయూత



సుల్తాన్‌బజార్: బోన్ మ్యారోతో బాధపడుతున్న మెదక్ జిల్లాకు చెందిన రాములు కుమార్తె హరిణి (10) బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుంది. రేయిన్‌బో ఆస్పత్రికి వెళ్తే బోన్ మ్యారో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రేమ్‌గాంధీని ఆశ్రయించారు. వారి సమస్యలు విన్న ఆయన హరిణి ఆపరేషన్‌కు అవసరమయ్యే విరాళాన్ని తాము ఇస్తామని హామీ ఇచ్చి చిన్నారి తల్లిదండ్రులకు రూ.1,84,100 చెక్కును అందజేశారు.

ఖురాన్ ప్రాముఖ్యతపై ఉచిత ఫొటో ఎగ్జిబిషన్

యాకుత్‌పురా: రంజాన్ మాసం చివరివారం సందర్భంగా పురానీహవేలీలోని హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం సిటీ గ్యాలరీలో ఈనెల 4వ తేదీ నుంచి ఖురాన్ ప్రాముఖ్యతపై 'గ్లోరీయస్ ఖురాన్' పేరుతో ఉచిత ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నామని హెచ్.ఈ.హెచ్ నిజాం మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ అహ్మద్ అలీ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రముఖ ప్రాంతాల్లోని చిత్రాలతో కూడిన ఖురాన్ ప్రాముఖ్యతకు సంబంధించిన అంశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉచిత ఫోటో ఎగ్జిబిషన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సత్కారం



అబిడ్స్ : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సీనియర్ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి ముకుల్ వాసనిని రాష్ట్ర మేరు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు సంఘం యువజన అధ్యక్షులు, మేరు సంఘం రాష్ట్ర నాయకులు ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్, గంగాపురం దశరథ్, వినయ్‌రాజ్‌లు ఆయనను సత్కరించి మేరుకులస్తుల సమస్యలతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా జనాభా ఉన్న మేరు కులస్తులకు చట్టసభల్లో స్థానం కల్పించి చైర్మన్ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

జియాగూడ: వంద ఫీట్ల జాతీయ రహదారిలో గుర్తు తెలియని ఓ మృతదేహాన్ని గుర్తించినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంనగర్ 100 ఫీట్ల జాతీయ రహదారి పక్కన మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు సుమారు 60ఏళ్లు ఉంటాయని, 5.5 అంగుళాల ఎత్తు, ఒంటిపై బనియన్, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు గుర్తిస్తే 87126 60490 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఇఫ్తార్ ఫ్రూట్ గిఫ్ట్స్.. !

గోల్కొండ: రంజాన్ మాసంలో పండ్లకు బాగా డిమాండ్ ఉంటుంది. పండ్ల తర్వాత ఎక్కువగా అమ్ముడుపోయేది కర్జురా పండు. ఉపవాస దీక్ష విరమణ సమయంలో వివిధ రకాల పండ్లతో పాటు ఖర్జురా పండు కూడా ఉంటుంది. అయితే సామూహిక ఇఫ్తార్ విందులో వివిధ పండ్లను విడివిడిగా పెడతారు. మరికొందరు తమ స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి బంధువులకు వివిధ రకాల పండ్లతో కూడిన గిఫ్ట్‌ప్యాక్‌లను అందిస్తారు. రంజాన్ మాసం వచ్చిందంటే పెద్ద పెద్ద ఫ్రూట్ స్టాల్స్ వారు ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లను తయారు చేయడంలో బిజీగా ఉంటారు. మెహిదీపట్నం, టోలిచౌకీ, తదితర ప్రాంతాల్లోని దుకాణాల వారు ఒకొక్కరు 75 నుంచి 125 వరకు ప్రతి రోజు ఫ్రూట్



గిఫ్ట్ ప్యాక్స్ తయారు చేస్తారు. వీటిలో గిఫ్ట్ ప్యాక్ ధరను బట్టి గిఫ్ట్ ప్యార్ బరువు ఉంటుంది. రూ.750 నుంచి రూ.4 వేల వరకు వివిధ రకాల పండ్లతో ఈ గిఫ్ట్ ప్యాక్‌లను తయారు చేస్తారు. తాము కొనుగోలుదారుల బడ్జెట్‌కు అనుగుణంగా గిఫ్ట్ ప్యాక్‌లను తయారు చేస్తున్నామని అజీజ్ చెబుతున్నారు.

ఎండ నుంచి రక్షణగా.. !

గోల్కొండ: గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకులకు కోట వద్ద అమ్ముతున్న వివిధ రకాల క్యాప్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఎండలో వచ్చే పర్యాటకులు వివిధ రకాలైన క్యాప్‌లను పరిశీలించి తమకు ఇష్టమైన క్యాప్‌లను కొనుక్కొని మరీ కోటలోకి వెళ్తున్నారు. గత ఐదు దశాబ్దాలుగా కోట వద్ద క్యాప్‌లు అమ్మే స్టాల్స్ కొనసాగుతున్నాయి. వివిధ రకాల క్యాప్‌లు ఒకే దగ్గర అమ్ముతుండటం ఈ స్టాల్ ప్రత్యేకత విభిన్నమైన స్టైల్స్, ప్రజల రుచులకు అనుగుణంగా దాదాపు 50 రకాల క్యాప్‌లు ఇక్కడ లభిస్తున్నాయి. కొన్ని క్యాప్‌లు ప్రత్యేకంగా తాము ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటామని క్యాప్‌స్టాల్ నిర్వాహకుడు మహ్మద్ ముజాహిద్ అహ్మద్ తెలిపారు. ప్రతినిత్యం పర్యాటకులు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారని.. వారి అభిరుచికి తగినట్లుగా క్యాప్‌లు అందుబాటులో పెడుతున్నామన్నారు. తమిళనాడు, బెంగాల్, కేరళ నుంచి వచ్చే పర్యాటకులు క్యాప్ కొనందే వెళ్లరని చెబుతున్నారు. తమిళ తంబి క్యాప్, ఫిలిం డైరెక్టర్ క్యాప్, కౌబాయ్ క్యాప్, లేడీ డయానా క్యాప్, క్వీన్ విక్టోరియా క్యాప్, సినీస్టార్ కృష్ణ క్యాప్ తదితర రకాల క్యాప్‌లు ఇక్కడ లభిస్తున్నాయి. కాగా విదేశీ పర్యాటకులు సైతం ఈ స్టాల్‌లో క్యాప్‌లను కొని సంబరపడుతుంటారు. క్యాప్ డిజైన్‌ను బట్టి రూ.40 నుంచి రూ.350 వరకు క్యాప్‌లు అమ్ముడవుతున్నాయి.



గోల్కొండ కోట వద్ద టోపీల అమ్మకాలు

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా

గన్‌ఫౌండ్రీ: అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో కళాశాల బీసీసెల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... అమరవీరుల త్యాగఫలితమే నేటి ప్రజల స్వేచ్ఛా జీవనమని తెలిపారు. ఉన్నత ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం విద్యార్థులు పనిచేయాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, బీసీసెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, పీఆర్‌ఓ సీహెచ్ పరందాములుతో పాటు కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజన ముక్తి పార్టీ జెండా ఎగరేస్తాం



నాంపల్లి: బహుజనులు రాజ్యాధికారం సాధించడం కోసం తాను బహుజన ముక్తి పార్టీలో చేరినట్లు కార్వాన్ నియోజకవర్గానికి చెందిన అందె ఉషాకన్న అన్నారు. ఈ మేరకు బుధవారం బహుజన ముక్తి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ సమక్షంలో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. బహుజన ముక్తి పార్టీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రంపల్లి శ్యామల్‌రాజ్, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్, రాష్ట్రీయ పరివర్తన్ మోర్చా రవీంద్ర మాలి, నేతలు చల్లకొల్ల పవన్‌కుమార్, అందె వెంకట్‌స్వామి, సర్వేకర్ బాబు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలని వినతి



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు ఎం .ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అహ్మదుల్లాఖాన్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్‌లోని ఫీల్‌ఖానాలోని వక్ఫ్‌బోర్డు స్థలంలో కొంతమంది కబ్జా చేశారని, తాము ఆధారాలతో చైర్మన్‌కు కలిసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వక్ఫ్‌బోర్డు స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలన్నారు. నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా వక్ఫ్‌బోర్డు స్థలాలను కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మహ్మద్ సలీం, మహ్మద్‌గౌస్, మహ్మద్ అఫ్రోజ్, ఆదిల్ బాబా, షకీల్ తదితరులున్నారు.

చెత్త రహిత నగరాన్ని నిర్మిద్దాం



విజయనగర్‌కాలనీ: నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుకుందామని జీహెచ్ఎంసీ సిబ్బంది స్థానికులతో ప్రమాణం చేయించారు. మాసబ్‌ట్యాంక్ నుంచి విజయనగర్‌కాలనీ సెయింట్స్ పాఠశాలకు వెళ్లే వీధిలో స్థానికులతో పాటు స్థానికేతరులు కూడా చెత్తవేసి డంపింగ్ యార్డులుగా చేశారన్నారు. ఈ వ్యర్థాలతో దోమలు వృద్ధి చెంది స్థానికులు అనారోగ్యాల బారిన పడుతూ.. నిద్రకు దూరమవుతున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం వారు వ్యర్థాలను తొలగించి జీహెచ్ఎంసీ పేరుతో ముగ్గులు వేసి పరిశుభ్రంగా తయారు చేశారు. వ్యర్థాలను స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే వేస్తామని, ఇష్టానుసారంగా పారవేయమని ప్రతిజ్ఞ చేయించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు నాగేష్‌లతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నియామకం



గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులైన ఒబేదుల్లా కొత్వాల్‌ను బుధవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్‌లు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జనజాతరను విజయవంతం చేయండి..

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈనెల 6న జనజాతర పేరుతో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, హైదరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒబేదుల్లా కొత్వాల్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

జాండిస్‌తో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ మృతి



సాయి ప్రకాష్ (ఫైల్)

సంతోష్‌నగర్: జాండిస్ (పచ్చ కామెర్లు) వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందాడు. అంత్యక్రియలకు నగర పోలీసుల తరపున కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వివరాల ప్రకారం... కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో సైదాబాద్ కుర్మగూడ ప్రాంతానికి చెందిన సాయి ప్రకాష్ (32) కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయిప్రకాష్‌కు జాండిస్ రావడంతో ఈనెల 1న నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఈనెల 2న సాయంత్రం 5.30 గంటలకు మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి సాయి ప్రకాష్ నివాసానికి చేరుకుని అంత్యక్రియల నిమిత్తం నగర పోలీసు తరపున రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. నగర పోలీసు సంక్షేమం సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

రోడ్డుపై అక్రమ పార్కింగ్ !



గోల్కొండ: నడిరోడ్లపై పార్కింగ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకీ, షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలు, కార్లు అక్రమంగా పార్క్ చేసి ఉంటున్నాయి. ముఖ్యంగా షేక్‌పేట్ బస్టాప్ వద్ద గల పాస్‌పోర్టు సేవా కేంద్రం ముందు కార్లు, ద్విచక్ర వాహనాలు గంటల తరబడి పార్క్ చేసి ఉంటున్నాయి. పాస్‌పోర్టు సేవా కేంద్రం వద్ద ఉన్న భవనం వాణిజ్య భవనం కావడంతో షాపులు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితోపాటు పాస్‌పోర్టు సేవా కేంద్రానికి వచ్చే వారు రోడ్డుపైనే తమ వాహనాలను పార్క్ చేస్తున్నారు. దీంతో టోలిచౌకీ నుంచి షేక్‌పేట్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: రంజాన్ సందర్భంగా స్టేషన్ పరిధిలోని షాపింగ్, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక షిఫ్ట్‌లతో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... నగర ట్రాఫిక్ డీసీపీ–3 ఆదేశాల మేరకు రంజాన్ షాపింగ్ ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజు రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ప్రత్యేక షిఫ్ట్‌లో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా సాలార్‌జంగ్ మ్యూజియం, దారుషిఫా, పురానీ హవేలీ, మీరాలంమండి, ఏతేబర్‌చౌక్, పంజేషా, యాకుత్‌పురా, అలీజాకోట్ల, బీబీబజార్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.